## క్లుప్తంగా

### అందరివాడు అరి గంగయ్య



అరిగంగయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం: తెలగ సామాజికవర్గంలో జన్మించిన అరి గంగయ్య అందరివాడని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు చనుమల్ల ప్రసాదరావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో నగరంలోని పాత బస్టాండ్ ప్రాంగణంలో అరి గంగయ్య 37వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.రమణమూర్తి, పి.వెంకటరావు, మహేష్, పి.నాని, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: విద్య, ప్రకృతి సేవే లక్ష్యంగా వాసవీ క్లబ్ జాతీయ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వాసవీ క్లబ్ రీజియన్ సెక్రెటరీ గుంపిన నారాయణరావు అన్నారు. గురువారం స్థానిక పూల్‌బాగ్‌లో గల సరస్వతి శిశు మందిర్ విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, సంఘ కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి ఏపీఎస్ కుమార్, డిమ్స్ రాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, మండవిల్లి వెంకటరాజు, బోడా నానాజీ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### అబ్దుల్ కలాం ప్రపంచం గర్వించదగ్గ వ్యక్తి

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



రక్తం దానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రపంచం గర్వించదగ్గ వ్యక్తి అని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక రోటరీ రక్తనిధి కేంద్రంలో భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, సయ్యద్ తాజ్, తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలాజీప్రసాద్ మాట్లాడుతూ, 8 వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 10 వలంటీర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, 23 మంది దరఖాస్తు చేశారన్నారు. అర్హత గల 21 మందికి ఇంటర్వ్యూ చేశామని, ఎంపికైన వారి జాబితా త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ విశ్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### రాయితీపై టమాటా..



టమాటా తూకం వేస్తున్న కార్పొరేటర్ పద్మారెడ్డి

విజయనగరం ఫోర్ట్: ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కార్పొరేటర్ నాయన పద్మారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక దాసన్నపేట రైతుబజార్‌లో ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న టమాటా విక్రయ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కిలో టమాటా 50 రూపాయలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎ.డి గంగాధర్, ఎస్టేట్ అధికారి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం

- భోగాపురం మండలంలో 1,586 మందికి ఇళ్ల స్థలాలు
- లబ్ధిదారుల మోములో ఆనందం

| భోగాపురం మండలంలోని లబ్ధిదారుల వివరాలు | |
|---|---|
| మంజూరైన స్థలాలు : | 1,586 |
| గృహ రుణాల లబ్ధిదారులు : | 915 |
| పునాది స్థాయిలో ఇళ్లు | : 588 |
| గోడలు పూర్తయినవి | : 46 |
| మొత్తం పూర్తయిన ఇళ్లు : | 248 |
| ఇంకా ప్రారంభించనివి | : 671 |



భోగాపురం జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

భోగాపురం: ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు.. అంటుంటారు పెద్దలు. అలాంటి సొంతింటి కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం అర్హులందరికీ అందాల హరివిల్లు అందిస్తోంది. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల వేగం పుంజుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు విడతలుగా భోగాపురం మండలంలో 1,586 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇందులో గృహనిర్మాణ శాఖ ద్వారా 915 మందికి గృహ నిర్మాణ రుణాలు మంజూరయ్యాయి. భోగాపురం, నందిగాం, చేపలకంచేరు, దల్లిపేట, సవరవిల్లి, రావాడ, ముక్కాం, లింగాలవలస, తదితర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గృహనిర్మాణ శాఖ ద్వారా రూ.1.80 లక్షలు పూర్తి రాయితీతో రుణం అందిస్తున్నారు. అలాగే రాయితీపై సిమెంట్, ఇసుకతో పాటు ఐరన్ కూడా ప్రభుత్వం అందజేస్తోంది. ఇంటి పునాదులకు రూ.51,200, గోడలు నిర్మిస్తే రూ.53,200, శ్లాబు వేసుకుంటే రూ.22,400, ప్లాస్టరింగ్ పూర్తయితే మరో రూ.23,200 నగదు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. మహిళా సంఘాలకు అదనంగా మరో రూ.50 వేల రుణాన్ని ఇస్తున్నారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో లబ్ధిదారులు నిర్మాణాలు జోరుగా చేపడుతున్నారు.



సుధారాణి నిర్మించుకున్న ఇల్లు

### కల నెరవేరింది



టీడీపీ పాలనలో ఎన్నిసార్లు ఇంటి కోసం దరఖాస్తు చేశానో తెలియదు. జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దాదాపు 15 ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్నాం. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మాకు ఇంటి స్థలం కేటాయించారు. ప్రభుత్వ సాయంతో గృహ నిర్మాణం మొదలుపెట్టాం. ఎటువంటి అటంకాలు లేకుండా ఇల్లు పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేశాం. నాకు జీవితంలో తీరదు అనుకున్న సొంతింటి కల సీఎం జగనన్నతో సాకారమైంది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా.

గుడివాడ సుధారాణి, లబ్ధిదారు భోగాపురం

### జగనన్న సహకారం మరువలేనిది



టీ దుకాణం నడుపుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో ఉంటూ అనేక ఇబ్బందులు పడుతున్నాం. జగనన్న సర్కారు వచ్చిన తర్వాత స్థానిక పంచాయతీ సిమ్మపేట లేఅవుట్‌లో ఇచ్చిన స్థలంతో పాటు అందించిన రూ.1.80 లక్షల రుణంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. మేము సొంతింట్లో జీవించడానికి సీఎం జగన్ అందించిన సహకారం మరువలేనిది. – బర్రి పోలమ్మ, లబ్ధిదారు భోగాపురం

# అర్హులందరికీ సంక్షేమం..



49వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 49వ డివిజన్ గాజులరేగలోని కొండపల్లివారి తోట నుంచి గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. అలాగే సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజా స్పందన అనూహ్యంగా వస్తోందన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకే చేరుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమస్యలు లేని డివిజన్‌లుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. డివిజన్ ఇన్‌చార్జ్ కనుగుల రాజా మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.



31వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్, స్థానిక కార్పొరేటర్లు

**31వ డివిజన్ నటరాజ్ కాలనీలో ....**

నగరంలోని 31 డివిజన్‌లోని 37, 38 సచివాలయాల పరిధిలో నటరాజ్ కాలనీ, తదితర ప్రాంతాలలో జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు మారం బాల బ్రహ్మరెడ్డి, బొద్దాన అప్పారావు, బైక్ రమేష్ పాల్గొన్నారు.

### తడి, పొడి చెత్త వేరు చేయాలి

పూసపాటిరేగ: తడి, పొడి చెత్త వేరు చేసి బుట్టల్లో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న తడి, పొడి చెత్త బుట్టలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలానికి 30, 064 ప్లాస్టిక్ బుట్టలు వచ్చాయని తెలిపారు. ఒక్కో ఇంటికి రెండు బుట్టలు చొప్పున పంపిణీ చేస్తామన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, కొత్తకోట శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

### కార్మిక సంఘ నాయకుడికి నివాళులు

నెల్లిమర్ల రూరల్: జూట్‌మిల్లు కార్మిక సంఘ మాజీ కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శీర వెంకటరావు మృతి బాధాకరమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిద గ్రామానికి చెందిన శీర వెంకటరావు గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పెనుమత్స గురువారం గ్రామానికి చేరుకుని వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ప్రశస్థ యాప్‌లో దివ్యాంగుల వివరాలు



ప్రశస్థ యాప్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న స్పెషల్ టీచర్ ఉదయలక్ష్మి

భోగాపురం: మండలంలో ఉన్న దివ్యాంగులను గుర్తించి వారి వివరాలను ప్రశస్థ యాప్‌లో నమోదు చేయాలని ప్రత్యేక ఉపాధ్యాయురాలు ఉదయలక్ష్మి, ఐఈఆర్‌పీ రమణరాజు అన్నారు. మండలంలోని రామచంద్రపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. యాప్ రిజిస్ట్రేషన్, స్క్రీనింగ్ విధానం, నమోదు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బైక్ దగ్ధం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో కోట వెనుక భాగాన నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం ఓ బైక్ దగ్ధమైంది. స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారమివ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. బైక్ రన్నింగ్‌లోనే షార్ట్ సర్క్యూట్ కావడంతో దగ్ధమైందని ఫైర్ అధికారులు స్పష్టం చేశారు.



దగ్ధమైన కేటీఎం బైక్

# ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: జగనన్న పాలనలో ఇంటి వద్దనే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రావాడ, రాజపులోవ సచివాలయాల ఆవరణలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, సర్పంచ్‌లు అపురభుక్త పైడినాయుడు, కిలారి స్వప్న, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్, ఏపీఎం రమణ, కిలారి వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పూసపాటిరేగ: వెంపడాంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందచేస్తున్న ఎంపీడీఓ రామారావు, శ్రీనివాసరావు, తదితరులు

**జగనన్న సురక్షతో సత్వర మేలు..**

పూసపాటిరేగ: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సత్వర మేలు చేకూరుతోందని ఎంపీడీఓ జి. రామారావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. వెంపడాం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించి, 725 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాసమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఏపీఓ రత్నమాల, వెలుగు ఏపీఎం పెంటంనాయుడు, ప్రజాప్రతినిధులు



డెంకాడ: లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

పిన్నింటి వెంకటరమణ, పిన్నింటి ఎల్లంనాయుడు, పిన్నింటి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత సేవలు...**

డెంకాడ: జగనన్న సురక్షతో ప్రజలకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని రఘుమండ, సింగవరం గ్రామాల్లో జరిగిన శిబిరాల్లో ప్రజలకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ స్వరూపారాణి, సర్పంచ్‌లు కలిశెట్టి రామకృష్ణ, గూడేల విష్ణు, పిట్టా పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చెంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి పాల్గొన్నారు.

# వలంటీర్ వ్యవస్థతో ప్రజల చెంతకు సేవలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రసామి



ప్రజలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజావసరాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 45, 46, 47, 48, 49, 50 డివిజన్‌లకు సంబంధించి ఆయా సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఇప్పటివరకు నగరంలో 58 వేల మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు చెప్పారు. ఇందుకోసం 1,120 మంది వలంటీర్లు అంకితభావంతో సేవలందించారని తెలిపారు. వ్యవస్థలో మార్పు తీసుకొచ్చేందుకు, ప్రజాసేవలను మరింత సులభతరంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 11 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు సులభంగా అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఏ పథకం పొందాలన్నా లంచాలతో ముడిపడి ఉండేదని.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ హయాంలోమాత్రం వలంటీర్లు ప్రజల వద్దకే వెళ్లి పథకాలు అందిస్తున్నారని చెప్పారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, నగరంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ధ్రువపత్రాలు అందించే కార్యక్రమం ముగిసిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదదరావు, ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు తాళ్లపూడి సంతోష్ కుమారి, బొద్దూరి గోవిందమ్మ, పట్నాన పైడిరాజు, నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్‌లు దూబే, కొసర నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మంచి చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



కొత్తపేటలో అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: గత ఎన్నికల్లో నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు అన్ని విధాలా మంచి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని కొత్తపేటలో సుమారు రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింట కుళాయిలు, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, డ్రైయిన్లు, సువ్వానిపేటలో రూ.23 లక్షలతో నిర్మించిన సీసీ, డ్రైయిన్లు, అప్పయ్యపేటలో రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, దీపిల్లిపేటలో రూ.3 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆ దిశగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా నేడు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో గ్రామాలు నిరాదరణకు గురయ్యాయని.. నేడు గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా తొలగిస్తూ అభివృద్ధిపథంలో తీసుకువెళుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీను, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, ఎంపీటీసీ సభ్యురాలు మిరప శాంతికుమారి, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ గిరిబాల పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరించి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నగరంలో శంకుస్థాపన మహోత్సవాలు చేపడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 38వ డివిజన్ ఉడా కాలనీ బొబ్బాదిపేట ప్రాంతంలో రూ.36.60 లక్షలతో చేపట్టనున్న రహదారులు, కాలువలు, కల్వర్టు, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వైఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం టీడీపీ విశ్వసనీయతను కోల్పోయిందన్నారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చేస్తున్న ఆరోపణలు విడ్డూరంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలను శతశాతం అమలు చేస్తూ మాట తప్పని నేతగా నిలిచారని కొనియాడారు. ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పాలనను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామిని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేటర్ దాసరి సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న పాలనలో సుభిక్షం..



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- కొత్తపేటలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం
- హాజరైన ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొత్తపేట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ.. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి వారి జీవన పరిస్థితులు మెరుగు పర్చడమే లక్ష్యంగా జగనన్న పాలన కొనసాగుతోందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని చెప్పారు. ప్రజలకు అన్ని విధాలుగా మంచి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, కార్పొరేషన్ డైరెక్టర్లు రేగాన శ్రీనివాసరావు, మద్దిల వాసు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మిరప శాంతికుమారి, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ గిరిబాల పాల్గొన్నారు.

### వితరణ

డెంకాడ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు విజయనగరానికి చెందిన అమ్మ సేవా సొసైటీ సభ్యులు గురువారం యూనిఫారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఆదినారాయణ, పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, సేవా సొసైటీ సభ్యురాలు ఝాన్సీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.